సాక్షి ఖమ్మం

శనివారం । 21 । జూన్ । 2025



ఆరోగ్యం.. ఆనంద'యోగ'ం!

ఒత్తిడితో పాటు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కోసం పలువురు యోగా సాధనను అలవర్చుకుంటున్నారు. 8లో



భద్రగిరిలో ఇక ఈ-టికెట్లు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో దర్శనం, ఆర్జిత సేవా టికెట్లను డిజిటల్ విధానంలో జారీ చేయనున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36°/ 27°

జిల్లాలో శనివారం ఉదయం, సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఎండ తీవ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

ఖమ్మంక్రైం: మాదక ద్రవ్యాల వినియోగంతో నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సమూలంగా నిర్మించడమే లక్ష్యంగా పోలీసులు అధికారులు కృషి చేయాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈనెల 26వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయిల్లో అవగాహన సదస్సులతో పాటు యోగా, ధ్యానం, ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, పోటీలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈమేరకు ఖమ్మం కమిషనరేట్‌లో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను సీపీ సునీల్‌దత్ వివరించారు. ఇంకా ఈ వీసీలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, సీఐ స్వామి పాల్గొన్నారు.

టీకాలతోనే ఆరోగ్య సంరక్షణ



సమీక్ష నిర్వహిస్తున్న డీఐఓ చంద్రునాయక్

ఖమ్మంవైద్యవిభాగం: మిషన్ ఇంద్రధనస్సు ద్వారా జిల్లాలో వంద శాతం గర్భిణులు, 0–5ఏళ్ల చిన్నారులకు టీకాలు వేయాలని, తద్వారా ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చంద్రూనాయక్ తెలిపారు. మిషన్ ఇంద్రధనస్సు, యోగా డే, డయేరియా నియంత్రణ కార్యక్రమాలపై శుక్రవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు ద్వారా గర్భిణులు, చిన్నారులను ఇంటింటి సర్వే ద్వారా గుర్తించి టీకాలతో ప్రయోజనాలను వివరించాలని సూచించారు. అలాగే, డయేరియా నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలని, చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లు అందించాలని తెలిపారు. కాగా, యోగా డే సందర్భంగా శనివారం ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని డీఐఓ సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ రామారావు, అదనపు డీఎంహెచ్ఓ బిందుశ్రీ, డీ.వీ.ఎల్ ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



అధికారుల సమక్షాన డ్రా తీస్తున్న విద్యార్థిని

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కీం(బీఏఎస్) ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను శుక్రవారం ఖమ్మంలోని డీపీఆర్‌సీ హాల్‌లో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బీఏఎస్‌లో సీటు రాని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, సంక్షేమ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ బీఏఎస్ పథకం ద్వారా ఒకటో తరగతిలో డే స్కాలర్లుగా 343దరఖాస్తులు అందగా 131 మందిని, ఐదో తరగతి(రెసిడెన్షియల్) ప్రవేశాలకు 219 దరఖాస్తులు అందితే 128 మందిని డ్రా ద్వారా ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సామినేని సత్యనారాయణ, ఎస్సీ డీడీ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


స్థాయీ సంఘం సమావేశంలో ఎంపీ



సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్: పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. స్థాయీ సంఘం ఆధ్వర్యాన నాలుగు రోజుల అధ్యయన యాత్ర కర్ణాటకలోని మంగళూరులో శుక్రవారం ప్రారంభమైంది. ఈ యాత్రకు చైర్మన్ సునీల్ తర్కరే అధ్యక్షత వహించగా, పెట్రోలియం, సహజ వాయువు ఉత్పత్తుల ధరలు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే కార్యాచరణపై చర్చించారు.

సన్నగా సర్దేస్తున్నారు



జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం కొద్దినెలలుగా సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుండడం అక్రమార్కులకు అవకాశంగా మారింది. కొందరు డీలర్లు, వ్యాపారులు ముఠాగా ఏర్పడి బియ్యాన్ని అధిక ధరలతో ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరోపక్క లబ్ధిదారులు కూడా బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. గతంలో దొడ్డు బియ్యం సరఫరా చేసిన సమయాన సాగిన అక్రమాలు ఇప్పుడు ఆగకపోగా.. పౌర సరఫరాల శాఖ అధికారులు నిఘా నేత్రాన్ని దాటి అక్రమార్కులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

అక్రమంగా కొనుగోళ్లు, తరలింపు

- వ్యాపారులకు సహకరిస్తున్న కొందరు డీలర్లు
- అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న వ్యాపారం
- తనిఖీలు ముమ్మరం చేస్తున్న పౌర సరఫరాల శాఖ

ఏళ్లుగా వేళ్లూనుకుని..

రేషన్ బియ్యం అక్రమ రవాణా చాప కింద నీరులా విస్తరించింది. పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఈ బియ్యం పక్కదారి పడుతున్నాయి. అయితే, దొడ్డు బియ్యం పంపిణీ సమయాన లబ్ధిదారులు తినలేక.. డీలర్లు, ఇతరులకు అమ్మేవారు. ఇక కొందరు వ్యాపారులు రేషన్ షాప్‌ల్లో మిగిలిన, లబ్ధిదారుల వద్ద సేకరించిన బియ్యాన్ని ప్రాసెస్ చేయించి అధిక ధరకు విక్రయించేవారు. కొందరు బడా వ్యాపారులు.. మిల్లర్లు, ఇతరుల నుంచి భారీ మొత్తంలో రేషన్ బియ్యం సేకరించి పాలిష్ చేయించాక విదేశాలకు ఎగుమతి చేశారు. కొన్ని సందర్భాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు బియ్యం లారీలను పట్టుకున్నా దందా మాత్రం ఆగలేదు.

సన్న బియ్యంతో చెక్ పెట్టాలని..

గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయగా వాటిని తినేందుకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్య తరగతి ప్రజలైతే బియ్యం అసలే తీసుకోలేదు. ఇదే అదునుగా బడా వ్యాపారుల జేబులు నింపుకున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులు కచ్చితంగా తింటారనే భావనతో ఈ ఏడాది ఉగాది నుంచి రేషన్‌షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. తొలి నెలలో బియ్యాన్ని లబ్ధిదారులు అధిక సంఖ్యలో తీసుకెళ్లి తినడానికి వీలుగా ఉన్నాయని తెలిపారు. తద్వారా అక్రమ రవాణాకు చెక్ పడినట్లేనని పౌర సరఫరాల శాఖ అధికారులు భావించారు.

కఠిన చర్యలు తీసుకుంటేనే..

సన్నబియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే అధికారులు తనిఖీలు ముమ్మరం చేయడమే కాక లబ్ధిదారులు బియ్యాన్ని అమ్ముకున్నట్లు తెలిస్తే కేసు నమోదు చేయడమే కాక రేషన్‌కార్డు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే బియ్యం అమ్మిన, కొనుగోలు చేసిన వారిపైనా కేసులు పెడతామని చెబుతున్నారు. ఈక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. అయితే, ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు రేషన్ షాప్‌లపైనా నిఘా పెట్టాలని పలువురు సూచిస్తున్నారు.

పక్కాగా పక్కదారి..

ప్రభుత్వం, అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ కొందరు వ్యాపారులు సన్న బియ్యాన్ని సైతం పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. మొదటి నెల పూర్తిగా లబ్ధిదారులు బియ్యం తీసుకోగా, ఆతర్వాత నెల నుంచి సొమ్ము చేసుకోవడానికి అక్రమార్కులు యత్నాలు ప్రారంభించారు. గతంలో దొడ్డు బియ్యంతో రూ.లక్షలు కొల్లగొట్టిన వ్యాపారులు.. ఇప్పుడు సన్నబియ్యం కావడంతో ప్రణాళికతో పక్కదారి పట్టించే కుట్రకు తెరలేపారు. కొన్నిచోట్ల లబ్ధిదారులు తీసుకోకపోగా మిగిలిన సన్న బియ్యం, ఇంకొన్నిచోట్ల లబ్ధిదారుల నుంచే నేరుగా సేకరించడం మొదలుపెట్టారు. దొడ్డు బియ్యం కన్నా ఎక్కువ డబ్బు ముట్టచెబుతుండటంతో పలుచోట్ల లబ్ధిదారులు అమ్ముకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇలా సేకరించిన సన్నబియ్యాన్ని తరలిస్తుండగా జిల్లాలో కొన్నిచోట్ల పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. తాజాగా గురువారం కల్లూరు నుంచి 145 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని లారీలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా వైరా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇవే కాకుండా రెండు నెలల కాలంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం తరలించినట్లు తెలుస్తోంది.



వైరాలో పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయీస్, పోలీసు ఉద్యోగులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కల్లూరు : కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన నాయకులు

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన
- తల్లాడలో అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- కల్లూరు, తల్లాడ కాంగ్రెస్ సమావేశాలకు హాజరు

తల్లాడ: వచ్చే మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలోని ప్రతీ పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తల్లాడ మండలం నారాయణపురం నుంచి కొడవటిమెట్ట వరకు రూ.5.50 కోట్లతో నిర్మించిన రహదారిని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ పాలన సాగిస్తోందని తెలిపారు. గత పాలకులు అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూనే ఎన్నికల వేళ తాము ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలను ప్రవేశపెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, ఈఈ తానేశ్వర్, ఆర్డీఓ రాజేందర్, డీఈ ఖలీల్‌అహ్మద్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజును చేసింది మనమే...

కల్లూరు/తల్లాడ: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కల్లూరు, తల్లాడలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సన్నబియ్యం పంపిణీ చేస్తుండడమే కాక యువతకు ఉద్యోగాలు ఇచ్చామని, పేదలకు ఇళ్లు, రైతులకు భరోసా, బోనస్ ఇస్తున్నామని తెలిపారు. అంతేకాక భూభారతితో సమస్యలు పరిష్కరిస్తుండడం ద్వారా రైతులను రాజుగా చేస్తున్నామన్నారు. కాగా, కాంగ్రెస్ అమలుచేస్తున్న పథకాలు, గత ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఈనేపథ్యాన కార్యకర్తల్లో విబేధాలు ఉన్నా పక్కన పెట్టాలని తెలిపారు. ఈ సమావేశాల్లో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవితో పాటు నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కాపా సుధాకర్, తూము వీరభద్రరావు, దగ్గుల రఘుపతిరెడ్డి, మార్నెళ్ల లక్ష్మణ్‌రావు, వీరారెడ్డి, కిషోర్, పోట్టేటి సంధ్యారాణి, బ్రహ్మారెడ్డి, గొడుగునూరి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గుర్రం శ్రీనువాసరావు, తుమ్మపల్లి రమేష్, ఆనంద్‌బాబు, వెంకటనారాయణరెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, వీరారెడ్డి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భాగం ప్రభాకర్‌రావు, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీను, ఎల్.పుల్లారావు, భూక్యా శివకుమార్ నాయక్, యాసా వెంకటేశ్వరరావు, నోటి కృష్ణారెడ్డి, దామాల రాజు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ : నారాయణపురంలో రోడ్డును ప్రారంభించిన మంత్రి శ్రీనివాసరెడ్డి

విపత్తుల నిర్వహణకు పకడ్బందీ ప్రణాళిక

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్: విపత్తుల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు పకడ్బందీగా సన్నద్ధం కావాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ గత ఏడాది వచ్చిన వరదలను పరిగణనలోకి తీసుకుని ఈసారి మూడు నెలల పాటు జిల్లాలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ఉంటాయని తెలిపారు. తద్వారా వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలకు వీలవుతుందని చెప్పారు. ఈమేరకు అధికారులు ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడమే కాక పునరావాస కేంద్రాలను గుర్తించాలని, అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని సూచించారు. డీఆర్వో ఏ.పద్మశ్రీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం కమాండర్ ఎస్.గౌతమ్, ఉద్యోగులు మద్దిలేటి, జగదీష్, సురేష్‌కుమార్, రియాజుద్దీన్, జనార్దన్ పాల్గొన్నారు.



ఏఐతో సులువుగా పనులు

అధికారులు విధి నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగిస్తూ సులువుగా పనులు చేసేలా త్వరలోనే వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఆయన విధి నిర్వహణపై సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు ఫైళ్లు పరిష్కరించాలని, ఉద్యోగులు బృందంగా పని చేస్తేనే ఫలితాలు వస్తాయని తెలిపారు. అందరూ సమయపాలన పాటించాలని, గైర్హాజరైతే అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆపై కలెక్టరేట్ నిర్వహణ, ప్రొటోకాల్ అంశాలపై సూచనలు చేశారు.

మత్కేపల్లిలో వ్యవసాయ మార్కెట్!

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

ఖమ్మంవ్యవసాయం: చింతకాని మండలం మత్కేపల్లిలో త్వరలోనే వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు కానుంది. చింతకాని, ముదిగొండ మండలాల రైతులకు ప్రయోజనం కలిగేలా ఈ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఖమ్మం మార్కెట్ నుంచి చింతకాని మండలం, నేలకొండపల్లి మార్కెట్ నుంచి ముదిగొండ మండలాలను విడదీసి కొత్తగా మత్కేపల్లిలో మార్కెట్ ఏర్పాటుచేస్తారు. ఈ విషయమై మార్కెటింగ్ శాఖ నుంచి అందిన ప్రతిపాదనలతో ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రతులు జిల్లా అధికారులకు చేరాయి. దీని ఆధారంగా రెండు మండలాల రైతులు, ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరిస్తారు. ఆపై తుది నోటిఫికేషన్ విడుదల చేసి మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతారు. తొలుత చింతకాని, ముదిగొండ మండలాల్లో రెండు వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటు చేయాలని భావించినా, ఒకటికే పరిమితం చేశారు. సుమారు 20ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ మార్కెట్ ఏర్పాటుకానుంది.

మేరునగధీరులు.. దాశరథి, ఆరుద్ర

జాతీయ సదస్సులో వక్తలు

ఖమ్మం సహకారనగర్: తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన దాశరథి, ఆరుద్ర తెలుగు సాహిత్య చరిత్రలో మేరునగధీరులుగా నిలిచారని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్ అన్నారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన 'శతజయంతి సాహితీమూర్తులు' పేరిట దాశరథి – ఆరుద్రజీవితం సాహిత్యంపై నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సమావేశానికి వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎస్.శాస్త్రి అధ్యక్షత వహించగా దాశరథి, ఆరుద్ర చిత్రపటాల వద్ద నివాళులర్పించాక వీసీ సూర్య ధనుంజయ్ తదితరులు మాట్లాడారు. తెలంగాణ పీడిత ప్రజల పక్షాన నిలిచి అక్షరమే ఆయుధంగా పోరాడిన యోధుడిగా దాశరథి తిమిరంతో సమరం చేశారని చెప్పారు. భూమి కోసం భుక్తి కోసం పోరాడిన బడుగు వర్గాలకు స్ఫూర్తినిచ్చారని తెలిపారు. ఇక ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య పరిశోధనతో చరిత్రను లోతుగా అధ్యయనం చేసి అరుదైన పరిశోధకుడిగా నిలిచారని కొనియాడారు. నేటి యువత వీరిద్దరి సాహిత్యంపై అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం దాశరథి, ఆరుద్ర సాహిత్యంపై ఓయూ తెలుగు శాఖాధిపతి ప్రొఫెసర్ సాగి కమలాకరశర్మ, సాహిత్య విమర్శకులు కవి రెంటాల వెంకటేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. ఈకార్యక్రమంలో కేయూ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ బన్న అయిలయ్య, కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుతో పాటు రవిమారుత్, ప్రసేన్, బానోత్ రెడ్డి, డాక్టర్ సునంద, డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ సీతారాం, డాక్టర్ జె.అనురాధ, కిరణ్‌కుమార్, డాక్టర్ ఎం.వీ.రమణ, డాక్టర్ కార్తీక్, కోటమ్మ, శ్రీ నివాస్ మాట్లాడగా వివిధ ప్రాంతాల అధ్యాపకులు 30మంది పత్రాలు సమర్పించారు.



దాశరథి, ఆరుద్ర చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ సూర్య ధనుజంయ్, తదితరులు

వాడీవేడిగా డీసీసీబీ మహాజన సభ

- మినిట్స్ బుక్ లేకపోవడంపై సభ్యుల మండిపాటు
- డిపాజిట్లు, ఇతర అంశాలపై ప్రశ్నల వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) 127వ మహాజన సభ వాడీవేడిగా సాగింది. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సభ నిర్వహించగా, తొలుత వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా సహకార సంఘాల చైర్మన్లు పలువురు తీర్మానాలను మినిట్స్ బుక్‌లో రాయాలని సూచించగా.. అధికారులు బుక్ తీసుకురాలేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాజన సభకు మినిట్స్ బుక్ లేకుండా హాజరుకావడం ఏమిటంటూ సమోసాలు, టీ కోసం వచ్చామా అని ప్రశ్నించారు. కాగా, 2007–08లో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారి నుంచి రూ.90 కోట్లు డిపాజిట్లు సేకరిస్తే, ఆ డిపాజిట్ల చెల్లింపుపై గత సభలో చేసిన తీర్మానం అమలుకు నోచుకోలేదని పలువురు తెలిపారు. వడ్డీ కలిపి రైతులకు చెల్లించాల్సి ఉందని చెప్పడంతో త్వరలోనే చెల్లిస్తామని బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్య బదులిచ్చారు. కాగా, పీఏసీఎస్‌లు పటిష్టంగా ఉన్న ప్రాంతాల్లో డీసీఎంఎస్, ఇతర సంస్థల ద్వారా ధాన్యం కొనుగోలుపై అవకాశం కల్పించటం సరికాదని పేర్కొన్నారు. అలాగే, ధాన్యం కొనుగోళ్ల సమయాన నియమించే సిబ్బంది వేతనాల విషయమై ప్రశ్నించగా కమీషన్ నుంచి వేతనాలు చెల్లించవచ్చని జిల్లా సహకార అధికారి గంగాధర్ తెలిపారు. అలాగే, బ్యాంకు రుణాల నుంచి వసూలు చేసే వాటాధనంలో సహకార సంఘాలకు భాగం ఇచ్చేలా తీర్మానానికి పలువురు పట్టుబట్టారు. అంతేకాక 2023 నుంచి మొక్కజొన్నల కొనుగోళ్లపై రూ.లక్షల్లో రావాల్సిన కమీషన్ చెల్లించాలని కోరగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ సమావేశం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని మార్క్‌ఫెడ్ జీఎం సునీత తెలిపారు. ఇంకా భద్రాద్రి జిల్లా కేంద్రంలో ఎరువుల స్టాక్ పాయింట్ ఏర్పాటు, సహకార సంఘాల ఉద్యోగుల బదిలీలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య, బ్యాంకు డైరెక్టర్లు గొర్ల సంజీవరెడ్డి, లక్కినేని సురేందర్‌రావు, లక్ష్మణ్‌రావు, ప్రసాద్, సైదులు, డీఆర్‌డీఓ అవధానుల శ్రీనివాసరావు, అధికారులు, పీఏసీఎస్‌ల చైర్మన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వరరావు, పక్కన డీసీఓ గంగాధర్, సీఈఓ వెంకటఆదిత్య తదితరులు

అక్రమాలపై విచారణకు నిర్ణయం

ఇళ్ల స్థలాలకు సంబంధించి నకిలీ ధ్రువ పత్రాలు సమర్పించి రూ.6 కోట్ల రుణాలు తీసుకున్న వ్యవహారంపై విచారణ చేపట్టాలని డీసీసీబీ పాలకవర్గం నిర్ణయించింది. మహాజన సభకు ముందుగా బ్యాంకు పాలకవర్గ సమావేశం జరగగా ఈ అంశాన్ని కొందరు సభ్యులు ప్రస్తావించారు. దీంతో బ్యాంకు సొమ్మును పక్కదారి పట్టించిన ఉద్యోగులపై చర్యలు తీసుకునేలా విచారణకు నిర్ణయించారు.

సభ్యులకు బీమా పెంపు

పీఏసీఎస్‌ల నుంచి పంట రుణాలు తీసుకునే సభ్యులకు గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పరిమితిని పెంచుతూ పాలకవర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం రూ.50 వేలుగా ఉన్న బీమా పరిమితిని రూ.లక్షకు పెంచారు. అలాగే, 2024–25లో బ్యాంకు గడించిన లాభాల్లో రూ.530.55 కోట్లను సహకార సంఘాలకు డివిడెంట్(ఆరు శాతం)గా చెల్లించాలని నిర్ణయించింది. అంతేకాక ఉద్యోగులకు 8–12 శాతం(దూరం ఆధారంగా) అలవెన్స్ చెల్లింపునకు నిర్ణయించారు.

లక్ష్యాన్ని చేరలేదు..



- ప్రభుత్వ స్కూళ్లలో చేరికలు తక్కువే..
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన విద్యార్థుల సంఖ్య
- ఆశించిన ఫలితాలు ఇవ్వని 'బడి బాట'

ఖమ్మం సహకారనగర్: ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన భవనాలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉండడమే కాక విద్యార్థులకు ఉచితంగా విద్య, పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్ అందుతోంది. అలాగే, నాణ్యమైన మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్నారు. అయినా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి మక్కువ చూపడం లేదని తేలింది. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ఈనెల 3నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించారు. అయితే, కార్యక్రమం ముగిశాక నమోదైన ప్రవేశాల ఆధారంగా లెక్కలు వేస్తే గత విద్యా సంవత్సరంతో పోలిస్తే విద్యార్థుల సంఖ్య తక్కువగానే ఉండడంతో బడిబాట ద్వారా ఆశించిన ఫలితాలు రాలేదని తెలుస్తోంది.

735మంది తక్కువ...

గత విద్యాసంవత్సరం ముగిసే నాటికి(ఏప్రిల్ 24న) జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు 66,289మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 10తరగతి విద్యార్థులు వెళ్లిపోగా, ఇతర పాఠశాలలకు మారిన వారిని కూడా మినహాయించి కనీసం అదే సంఖ్యలోనైనా విద్యార్థులు ఉండేలా ప్రవేశాలకు కృషి చేశారు. కానీ శుక్రవారం గణాంకాలను పరిశీలిస్తే విద్యార్థుల సంఖ్య 65,554మందిగా తేలింది. ఆదిలోనే గతేడాది కంటే విద్యార్థుల సంఖ్య 735 తక్కువ ఉండగా.. వీరంతా కొనసాగుతారా.. ఇంకొందరు ఇతర పాఠశాలలకు వెళ్తే పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదు.

సహకారం అందలేదా?

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో బడిబాట నిర్వహించాలని ఆదేశించింది. అయితే, చాలా శాఖల అధికారుల నుంచి సహకారం లభించలేదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మండల ప్రత్యేక అధికారులు బడిబాట కార్యక్రమానికి నోడల్ అధికారులుగా ఉండగా... చాలాచోట్ల పాల్గొనలేదని సమాచారం. తద్వారా ఆశించిన ఫలితాలు రాలేదని తెలుస్తోంది.

ప్రభుత్వ స్కూళ్లలో తరగతుల వారీగా విద్యార్థులు

	28-04-2024	20-06-2025
1వ తరగతి	5,448	4,724
2వ తరగతి	5,486	6,116
3వ తరగతి	6,361	6,348
4వ తరగతి	7,675	7,103
5వ తరగతి	5,348	7,526
6వ తరగతి	6,820	4,842
7వ తరగతి	7,125	7,158
8వ తరగతి	7,500	6,919
9వ తరగతి	7,433	7,430
10వ తరగతి	7,093	7,388
మొత్తం	66,289	65,554

లక్ష్యసాధనకు కృషి చేస్తాం..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మరింత పెరిగేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే మూతపడిన 12పాఠశాలలు తెరిపించాం. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రవేశాలు నమోదయ్యాయి. అయితే, గతేడాది కంటే విద్యార్థులు తగ్గకుండా మరిన్ని ప్రయత్నాలు చేస్తాం.

– రాజశేఖర్, విద్యాశాఖ సీఎంఓ

క్లుప్తంగా

ముగ్గురికి ఎస్సైలుగా పదోన్నతి


ఎస్సైలకు స్టార్‌లు అందజేస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఏఎస్సైలుగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురికి ఎస్సైలుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించిన ఎం.సూర్యనారయణ, బేగ్, రాఘవయ్యను కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం సన్మానించారు.

జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్స్ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు రెండు జిల్లాల నుంచి 35 మంది క్రీడాకారులు హాజరయ్యా రు. వీరిలో ప్రతిభ చాటిన వారితో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశామని అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఈ జట్టు 28నుంచి జూలై 1వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని వెల్లడించారు.

టేబుల్ టెన్నిస్ జట్లు..


ఎంపికైన క్రీడాకారులతో ప్రతినిధులు

ఖమ్మం సర్దార్ పటేల్‌స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ జట్లను ఎంపిక చేశారు. ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న ఈ జట్ల ఎంపికను టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.మూర్తి పర్యవేక్షించారు. బాలుర అండర్–13లో షేక్ సాహెల్ ఫజల్, అండర్–15లో గొరిశెట్టి చార్విక్ స్థితప్రజ్ఞ, అండర్–17లో పరిటాల జ్వలిత్, ఎం.డీ.అనస్, సాత్విక్, రాధాకృష్ణ, అండర్–19లో పిట్టల మోహిత్ కృష్ణ ఎంపికయ్యారని తెలిపారు. అలాగే, బాలికల విభాగం అండర్–13లో బొంతు సాయి, శివానీ, అండర్–17లో అమృత, గద్దల సిరి ఎంపిక కాగా అసోసియేషన్ బాధ్యులు షేక్ మజ్హార్, పరిటాల చలపతి, గద్దల రామారావు, రెడ్డి సాయి, శివ, అజయ్ పాల్గొన్నారు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


డిప్యూటీ సీఎంతో జేఏసీ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఉద్యోగ సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఆయను కలిసి పలు సమస్యలను వివరించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారుల సంఘం నాయకుడు రవీంద్రరెడ్డి, టీజేఏసీ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీల బదిలీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమశాఖ పాఠ శాలల్లో ఐదేళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్న ఉపాధ్యాయుల(సీఆర్‌టీ)ను బదిలీ చేశారు. ఆశ్ర మ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న 64 మంది సీఆర్‌టీలకు సబ్జెక్టుల వారీగా శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చినట్లు డీడీ విజయలక్ష్మి తెలిపారు. ఆ తర్వాత బెస్ట్ అవైలబు ల్ పాఠశాలల్లో 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశానికి అందిన దరఖాస్తుల ఆధారంగా తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమక్షాన డ్రా ద్వారా విద్యార్థుల ను ఎంపిక చేశామని డీడీ వెల్లడించారు. కార్యక్రమాల్లో వైరా ఏటీడీఓ జహీరుద్దీన్, ఏఓ నారాయణరెడ్డి, ఏసీఎంఓలు రాములు, రమేశ్, హెచ్‌డబ్ల్యూఓలు హన్మంతరావు, రాంబాబు, రాజేందర్, నర్సింహారావు, శ్రీనివాసరావు, ధనుశ్, భద్రాచలం ఎంఈఓ రమతో పాటు అలివేలు మంగతాయారు, రంగయ్య, ప్రసాద్, శ్రీధర్, మణికుమార్, సురేశ్, భద్రం పాల్గొన్నారు.

ఉసురు తీసిన క్షణికావేశం

ఖమ్మంక్రైం: భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంతో ఒకరి ప్రాణాలు కోల్పోగా, మరొకరు ఆస్పత్రి పాలయ్యారు. ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు, త్రివేణి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై 13వ తేదీన వివాదం తలెత్తడంతో క్షణికావేశాని కి లోనైన నాగేశ్వరరావు నిద్రమాత్రలు మింగాడు. దీంతో ఆయన ఆస్పత్రిలో చేర్పించగా.. సపర్యలు చేస్తున్న త్రివేణి ఈనెల 15న ఇంట్లో ఎలుకల మందు తాగింది. ఈమేరకు ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతే శుక్రవా రం మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

ఆరోగ్యం.. ఆనందయోగం!



మానవ జీవితంలో ఉద్యోగ, వ్యాపార బాధ్యతలతో పెరుగుతున్న ఒత్తిడి.. నానాటికీ కలుషితమవుతున్న వాతావరణం.. అలుముకుంటున్న కొత్తకొత్త వ్యాధులతో ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. ఈనేపథ్యాన యోగా సాధన అన్నివర్గాల ప్రజలకు ఉపశమనంలా ఉంటుందని చెబుతున్నారు. ప్రతిరోజు యోగా అభ్యసన ద్వారా ఒత్తిడి దూరమవుతుందని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివిధ సంస్థల బాధ్యులు అవగాహన కల్పిస్తున్నారు.

–ఖమ్మం స్పోర్ట్స్/సత్తుపల్లి టౌన్


ఖమ్మంలో యోగా సాధన చేస్తున్న ఔత్సాహికులు


సత్తుపల్లిలో యోగా సాధన

మా కల నెరవేరుతోంది..



దాదాపు 40ఏళ్ల క్రితం ఖమ్మంలో తొలిసారి యోగా కేంద్రాన్ని ప్రారంభించాం. అప్పట్లో కేవలం పది మందే వచ్చేవారు. ఇప్పుడు ఆశించిన స్థాయిలో సాధకులు వస్తున్నారు. అంతేకాక మరిన్ని కేంద్రాలు ఏర్పాటుకావడం, ప్రభుత్వం సైతం గుర్తించడంతో మా కల నెరవేరుతోంది.

– జీవీకే.శర్మ, పతంజలి యోగా కేంద్రం, ఖమ్మం

సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యం



ప్రతీ మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. ఇందుకోసం యోగా, ధ్యానం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. ప్రధానంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించే శక్తి యోగాకు ఉంది. ఆడ, మగ బేధం లేకుండా సాధన చేయొచ్చు.

– కోదండరావు, సిద్ధార్థ యోగా కేంద్రం, ఖమ్మం

యోగాను విస్తృత పరుస్తాం



సర్దార్ పటేల్‌స్టేడియంలో యోగా కేంద్రం ఏర్పాటుకు మా వంతుప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే యోగాలో జాతీయ, రాష్ట్రస్థాయిలో పలువురు రాణించారు. వీరితో పాటు ఔత్సాహికుల కోసం ప్రత్యేక యోగా కేంద్రం ఏర్పాటు చేసే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

- యోగా సాధనకు పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలో పలు సంస్థల ఆధ్వర్యాన కేంద్రాలు, ఉచిత శిక్షణ
- ఆసక్తిగా హాజరవుతున్న సాధకులు

నేడు యోగా దినోత్సవం


సత్తుపల్లిలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం

40ఏళ్ల క్రితమే కేంద్రం

వందల ఏళ్ల క్రితమే యోగా మనుగడలో ఉన్నట్లు తెలుస్తుండగా గత పది, పదిహేనేళ్ల నుంచి మాత్రం విస్తృత ప్రాచుర్యంలోకి వచ్చింది. దీంతో కొన్ని సంస్థల ద్వారా జిల్లా, మండల కేంద్రాల్లో యోగా ఉచిత శిక్షణ ఇస్తుండగా ఔత్సాహికులు హాజరవుతున్నారు. ఖమ్మంలో దాదాపు 40 ఏళ్ల క్రితం పతంజలి యోగా కేంద్రాన్ని తొలిసారిగా స్థాపించారు. ఇందులో శిక్షణ పొందిన పలువురు రాష్ట్ర, జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటడం విశేషం. అంతేకాక జిల్లాలో శ్రీరామకృష్ణ యోగా సమితి, శ్రీరామచంద్ర మిషన్, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, బ్రహ్మకుమారీల ద్వారా శిక్షణ కొనసాగుతోంది. ఈమేరకు నేడు (శనివారం) అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సంస్థల నిర్వాహకులు, సాధకుల అభిప్రాయాలు.

1998లో స్థాపించాం..



సత్తుపల్లిలోని శ్రీరామకృష్ణ యోగా సమితిని 1998లో స్థాపించి యోగాసనాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నాం. రాజారత్నదారి, గువ్వల కృష్ణారెడ్డితో కలిసి ఏటా సుమారు వేయి మందికి కళాభారతి వేదికగా యోగాసనాలు నేర్పిస్తున్నాం. విద్యార్థులు, జైలు ఖైదీలకు కూడా శిక్షణ ఇచ్చాం.

– చల్లగుళ్ల అప్పారావు, శ్రీరామకృష్ణ యోగా సమితి, సత్తుపల్లి

ధ్యానంతో ప్రశాంతత..



ధ్యానంతో ఒడిదుడుకులు, కోపాన్ని జయించవచ్చు. భౌతిక, ఆధ్యాత్మిక జీవనంలో సమతుల్యత ఏర్పడుతుంది. విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అందుకే ఏటా 'హార్ట్‌ఫుల్‌నెస్ ఎక్స్‌పీరియన్స్ లైఫ్ పొటెన్షియల్' పేరిట విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఉప్పన శ్రీనివాసరెడ్డి, శ్రీరామచంద్ర మిషన్, సత్తుపల్లి

15 ఏళ్లుగా ధ్యాన శిక్షణ



శ్వాసపై ధ్యాస కలిగేలా ధ్యానంపై శిక్షణ ఇస్తున్నాం. సత్తుపల్లిలో 15 ఏళ్లుగా పిరమిడ్ కేంద్రం నిర్వహిస్తున్నాం. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల నుంచి పలువురు ఇక్కడకు వస్తున్నారు. నిత్య సాధనతో మానసిక సమతుల్యత, ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తుంది.

– బెల్లంకొండ సుశ్మిత, పిరమిడ్ సొసైటీ, సత్తుపల్లి

దర్శనం, ఆర్జిత సేవలకు ఇక ఈ–టికెట్లు

- ట్రయల్ రన్ నిర్వహించిన దేవస్థానం ఈఓ
- ఇప్పటికే రామాలయంలో డిజిటల్ సేవలు


మిషన్ ద్వారా టికెట్లను కొనుగోలు చేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో డిజిటల్ సేవలు భక్తులకు మరింత చేరువ అవుతున్నాయి. ఇప్పటికే పలు విభాగాల్లో డిజిటల్ సేవలు అందుతుండగా తాజాగా స్వామివారి దర్శన, ఆర్జిత టికెట్లు పొందేందుకు మిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం శుక్రవారం ఆలయంలో ట్రయల్ రన్ నిర్వహించారు. మూడు మిషన్లను ఫెడరల్ బ్యాంక్ అధికారులు ఉచితంగా అందించగా, పడమెర మెట్ల వైపు ఒకటి, లడ్డూ కౌంటర్ల వద్ద రెండు మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. యంత్రాలతో భక్తుల సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది. మరికొన్ని మిషన్లను దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు బ్యాంకర్లతో దేవస్థానం అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్ యాప్..

రామాలయ సమస్త సమాచారం లభించేలా భద్రాచలం టెంపుల్ ఇన్ఫర్మేషన్(బీటీఐ) యాప్ రూపొందించారు. తెలంగాణలోనే తొలిసారిగా యాప్‌ను రూపొందించి భక్తులకు చేరువైన దేవస్థానంగా రామాలయం నిలిచింది. ఇందులో ఆలయానికి సంబంధించిన 22 రకాల సేవల వివరాలు లభ్యమవుతాయి. సేవలు పొందే ప్రదేశాలతో గూగుల్ మ్యాప్‌ను అనుసంధానించారు. భద్రాచలంతోపాటు చుట్టు పక్కల ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఉపాలయాలు, సందర్శనీయ స్థలాల వివరాలు కూడా పొందుపర్చారు.

త్వరలో అకౌంట్లు సైతం..

త్వరలో అకౌంటింగ్ సెక్షన్‌ను సైతం డిజిటల్‌గా మార్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రికార్డుల నిర్వహణలో ఉద్యోగుల చేసే తప్పులకు ఆడిటింగ్ సమయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు, అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు రికార్డులను కంప్యూటరైజ్ చేయనున్నారు. దీంతో ఉద్యోగులకు పని ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ఈఓ రమాదేవి సాఫ్ట్‌వేర్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు. మరో నెల రోజుల్లో రికార్డులు సైతం కంప్యూటరైజ్డ్ చేసే అవకాశం ఉంది.

డిజిటల్‌మయంగా రామాలయం

రామాలయం డిజిటల్‌మయంగా మారుతోంది. తొలుత దేవస్థాన వెబ్‌సైట్ ఆధునికీకరించారు. లడ్డూ కౌంటర్లలో టికెట్లను కంప్యూటరైజ్ చేశారు. నిత్యాన్నదానం, గోశాలకు విరాళాలు ఇచ్చే వారి వివరాలు నమోదుతో పాటు దాతలకు ఆన్‌లైన్ రశీదులు అందజేస్తున్నారు. స్వామివారి వస్త్రాల విక్రయాలకు బార్‌కోడ్ రూపొందించారు. ప్రొటోకాల్ దర్శనానికి వచ్చే వారికి స్కాన్‌తో ఫొటో తీసి ఎంట్రీ టికెట్ అందజేస్తున్నారు. అన్నదానానికీ ఈ–టోకెన్ ఇస్తున్నారు. ఇలా అన్ని విభాగాల్లో డిజిటల్ సేవలను విస్తరింపజేశారు.

సులభంగా సేవలు పొందేలా..

ఒక్కొక్కటిగా భక్తులకు డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. భక్తులకు సమయం ఆదా, సులభరీతిలో సేవలు అందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. యాప్, ఆన్‌లైన్‌లో సేవలతోపాటు తాజాగా కియోస్కి మిషన్ల ద్వారా దర్శన, ప్రసాద టికెట్లు విక్రయించే చర్యలు చేపట్టనున్నాం. వీటిపై ట్రయల్‌రన్ నిర్వహించాం.

– ఎల్.రమాదేవి, రామాలయ ఈఓ

రాజకీయాల్లో యువత పాత్ర కీలకం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శివచరణ్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకమని గుర్తించి సమాజ మార్పునకు ముందుకు రావాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత ఉందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. అంతేకాక ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని తెలిపారు. ఇదే సమయాన యువతకు అత్యధిక సీట్లు ఇచ్చేలా నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి దీపక్ ప్రజ్ఞ మాట్లాడుతూ కష్టపడి పని చేసే వారికి పదవులు తప్పక వస్తాయని తెలిపారు. తొలుత మయూరి సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, కార్యదర్శి జెర్రిపోతుల అంజనీకుమార్, నాయకులు యడ్లపల్లి సంతోష్, ఖలీల్ పాషా, బెజ్జం గంగాధర్, బానోత్ కోటేష్ పాల్గొన్నారు. కాగా, సభ్యత్వ నమోదులో ప్రతిభ కనబరిచిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కె.క్రాంతికుమార్‌ను శివచరణ్‌రెడ్డి సత్కరించారు.

మెరుగైన వైద్యంతో మన్ననలు పొందాలి


ఆస్పత్రి యాజమాన్యంతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

మధిర: మధిర ప్రాంత వాసులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా అత్యాధునిక పరికరాలతో ఆస్పత్రిని ఏర్పాటుచేసిన హైకేర్ ఆస్పత్రి యాజమాన్య బాధ్యులు అభినందనీయులని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మధిరలో హైకేర్ ఆస్పత్రి భవనాన్ని శుక్రవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ వారి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ జంగా నవీన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డితో పాటు డాక్టర్ రామనాథం, డాక్టర్ కనకపూడి అనిల్, మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, సూరం శెట్టి కిషోర్, తూమాటి నవీన్‌రెడ్డి, రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, అద్దంకి రవికుమార్, ఏలూరు నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు పాల్గొన్నారు.

సింహాసనంపై ఒకరు.. ప్రజల గుండెల్లో మరొకరు

ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి బాహుబలి సినిమా మాదిరిగా ఉందని ఆ రాష్ట్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. హైకేర్ ఆస్పత్రి ప్రారంభానికి హాజరైన ఆయన జంగా నవీన్‌రెడ్డి, జంగా ప్రవీణ్‌రెడ్డిని అభినందించి మాట్లాడారు. ఆంధ్రాలో సింహాసనంపై ఒకరు కూర్చుంటే, ప్రజల గుండెల్లో మాత్రం మరొకరు (వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి) ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రేమ జగన్‌మోహన్‌రెడ్డిపై ఇలాగే ఉండాలని, ఈ ప్రేమ నిలబెట్టుకునేలా 24 గంటలు కష్టపడతామని తెలిపారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

మధిర: ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయులకు సంబంధించి అనేక సమస్యలు పీఆర్‌టీయూ కృషి తో పరిష్కారమయ్యాయని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు తెలిపారు. మధిర మండలంలోని రామచంద్రాపురం, జాలిముడి, మల్లారం, సిరిపురం, మాటూరు, మర్లపాడు, నిధానపురం, జిలుగుమాడు తదితర పాఠశాల్లో నమో దు సభ్యత్వ చేపట్టగా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మారెడ్డితో కలిసి రంగారావు మాట్లాడారు. భవిష్యత్‌లోనూ విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందు నిలుస్తామని తెలిపారు. కాగా, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుతో పేరుతో పాఠశాలలను విలీనం చేయకుండా, ప్రస్తుతం పాఠశాలలనే అభివృద్ధి చేయాలని, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్‌తో పాటు కొమ్ము శ్రీనివాసరావు, ఎస్.కే. మదార్, తూమాటి కృష్ణారెడ్డి, కొలగాని ప్రసాదరావు, శాంతబాబు, మల్లెల శ్రీనివాస్, శ్యామలరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం


ఇసుక రీచ్ వద్ద పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం: మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఏలువారిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. గ్రామంలో ఇళ్లను శుక్రవారం పరిశీలించిన ఆమె లబ్ధిదారులు, అధికారులతో మాట్లాడారు. ఆతర్వాత హైదర్‌సాయిపేట, పడమటితండా ఇసుక రీచ్‌లను పరిశీలించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కూపన్లు సకాలంలో జారీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీఓ ఎస్.కే.సిలార్ సాహెబ్, తహసీల్దార్ జి.లూథర్ విల్సన్, ఎంపీఓ పి.సూర్యనారాయణ, ఉద్యోగులు వీరయ్య, మిథున్, సునీత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


జగదీశ్ (ఫైల్)

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపాన గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతసాగర్‌కు చెందిన వట్టికూటి జగదీశ్(27) మృతి చెందాడు. ఆయన ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి అనంతసాగర్ వస్తుండగా పందిళ్లపల్లి సేషన్ సమీపాన ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జగదీశ్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన తండ్రి నాసరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

బంక్‌ల్లో నాణ్యత తప్పనిసరి


బంక్‌లో కొలతలు పరిశీలిస్తున్న డీసీఎస్‌ఓ

ఖమ్మంరూరల్: పెట్రోల్ బంక్ యజమానులు నాణ్యత పాటిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని డీసీఎస్‌ఓ చందన్‌కుమార్ సూచించారు. మద్దులపల్లిలోని స్తంభాద్రి పెట్రోల్ బంక్‌ను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన మీటర్ రీడింగ్, కొలతలను పరిశీలించాక సూచనలు చేశారు. అలాగే, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఓ సమ్మయ్య, డీటీసీఎస్ విజయ్‌బాబు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.63లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం సంభానీనగర్‌కు చెందిన షేక్ అన్వర్‌జానీ రూ.63 లక్షలకు దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా పలువురి వద్ద నగదు అప్పు తీసుకున్నాడు. ఇప్పుడు అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందంటూ పది మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా శుక్రవారం ఖమ్మం సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

చెల్లని చెక్కుల కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కులు చెల్లకపోవడంతో వరంగల్‌కు చెందిన తొడుకునూరి రత్నాకర్, మహమ్మద్ హిమాయత్ అలీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిక్కం రజిని తీర్పు చెప్పారు. శుక్రవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలు... ఖమ్మం పంపింగ్‌వెల్ రోడ్డుకు చెందిన చుక్కల సరళాదేవికి చెందిన స్థలాలను కమీషన్ పద్ధతిపై అమ్ముతామని నమ్మించిన రత్నాకర్, అలీ జీపీఏ చేయించుకున్నారు. ఆపై స్థలాలు అమ్మినా సరళకు డబ్బు ఇవ్వకపోగా, పలుమార్లు అడిగాక చెరో రూ.30 లక్షల చొప్పున చెక్కులు జారీ చేశారు. కానీ వారి ఖాతాల్లో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురయ్యాయి. దీంతో ఆమె న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం ఇద్దరికి ఏడాది జైలుశిక్ష విధించడమే తో పాటు ఫిర్యాదికి చెరో రూ.30 లక్షలు చెల్లించాలని న్యాయవాధికారి తీర్పు చెప్పారు.

వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్‌యాదవ్


నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

కామేపల్లి: రాష్ట్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల అభివృద్ధి మండలి వైస్ చైర్మన్‌గా జాలె శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన ఆయనకు శుక్రవారం ఢిల్లీలో జాతీయ మండలి అధ్యక్షుడు రాహుల్ ద్వివేది నియామకపత్రం అందజేచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ, అటవీ సంబంధిత విధానాలు, కార్యక్రమాల ప్రణాళికలు విస్తరించడం, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వరిస్తానని తెలిపారు.

పాత విధానంలోనే పంట రుణాలు ఇవ్వాలి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 1/70 చట్టం కారణంగా రైతులకు పంట రుణాల జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నందున, గతంలో మాదిరి పహానీల ఆధారంగా రుణాలు ఇవ్వాలని పలు పీఏసీఎస్‌ల చైర్మన్లు కోరారు. ఈ సందర్భంగా ఖమ్మంలో శుక్రవారం జరిగిన డీసీసీబీ మహాసభలో జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, డీసీసీబీ సీఈఓ వెంకట్‌ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. అలాగే, ఏజెన్సీ రైతులు సహకార బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో పాల్వంచ, కొత్తగూడెం, మేడేపల్లి, కొణిజర్ల పీఏసీఎస్‌ల చైర్మన్లు కొత్వాల శ్రీనివాసరావు, మండే హన్మంతరావు, సామినేని వెంకటేశ్వరరావు, చెరుకుపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విగ్రహాలు ధ్వంసం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన గాంధీ, సరస్వతీదేవి విగ్రహాలను గుర్తుతెలి యని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు, స్థానికులు గుర్తించా రు. ఈమేరకు పోలీసులు నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పసుమర్తి శ్రీనివాస్ తదితరులు కోరారు.